Eenadu D-15/05/16.

ఆదివారం 15 మే 2016

# రవాణా కేంద్రంగా
# జేబీఎస్- పరేడ్ మైదానం



పనుల పరిశీలనలో మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, అధికారులు

**కారిడార్-2 పనులను పరిశీలించిన మెట్రో ఎండీ**

ఈనాడు, హైదరాబాద్

నగరంలోని జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి పరేడ్‌మైదానం వరకు రవాణా కేంద్రం(హబ్)గా అభివృద్ధి చేయనున్నారు. అలానే హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఎంఆర్) తనకు గణేష్ ఆలయం ఎదురుగా ఉన్న రెండెకరాల స్థలంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తుంది. ఇక పాత ఎంసీహెచ్ ప్రాంగణంలో తనకున్న ఎకరా స్థలంలో పార్కింగ్‌తోపాటు మాల్‌ను నిర్మించేందుకు ఎల్ అండ్‌టీ పరిశీలిస్తుంది. సమీపంలోనే పరేడ్ మైదానం ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్ రాబోతున్నందున వీటన్నింటికి ఆకాశ నడక మార్గాల ద్వారా అనుసంధానం చేయనున్నారు. ఉత్తర తెలంగాణ నుంచి నగరానికి వచ్చేవారు జేబీఎస్ నుంచి నేరుగా సిటీలోకి వెళ్లేందుకు మెట్రోని ఉపయోగించుకోవచ్చని ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. కారిడార్-2 జేబీఎస్ నుంచి ఫల్లీ జౌలి పనులను ఎల్ అండ్‌టీ నూతన ఎండీ శివానంద్ నింబర్గీతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఉత్తర తెలంగాణ ముఖద్వారమైన ఈ ప్రాంతాన్ని త్రికోణ ఆకారంలో రవాణహబ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**● పాత గాంధీ ఆసుపత్రి ప్రాంగణంలో..**

సికింద్రాబాద్ పాత గాంధీ ఆసుపత్రి ప్రాంగణంలో మెట్రో పశ్చిమస్టేషన్ వస్తుంది. జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వెళ్లే మెట్రోమార్గమిది. ఇక్కడి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు సమీప అతిపెద్ద బస్టాప్‌కు చేరుకోవచ్చు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ మోడల్ రవాణా హబ్‌గా తీర్చిదిద్దాలని హెచ్ఎంఆర్ ఇదివరకే నిర్ణయించింది. ఎల్ అండ్‌టీ ఎండీ కూడా ఈ ప్రతిపాదనను పరిశీలించారు. ఇక్కడ హెచ్ఎంఆర్‌కు, ఎల్ అండ్ టీకి చెరో ఐదు ఎకరాల స్థలం ఉంది. హెచ్ఎంఆర్ తన స్థలంలో పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయనుండగా... ఎల్అండ్‌టీకి కేటాయించిన స్థలంలో పార్కింగ్, ఇతర వాణిజ్యకేంద్రాలు వస్తాయి. రైల్వే స్టేషన్‌కు మరోవైపు కారిడార్-3కి వెళ్లే మెట్రో స్టేషన్ వస్తుంది. రెండు మెట్రోస్టేషన్లకు ఆకాశనడక మార్గాల ద్వారా అనుసంధానం చేస్తూ.. మధ్యలో రైల్వే రిజర్వేషన్ కేంద్రం, స్టేషన్‌లోకి చేరుకునేలా సంధానం ఉంటుంది. నిత్యం రైల్వే స్టేషన్‌కు, బస్టాపుల నుంచి ప్రయాణించేవారి సంఖ్య 5 లక్షల వరకు ఉంటుంది. రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్నివిధాల అనువైన ప్రదేశమని ఎన్వీఎస్‌రెడ్డి నింబర్గీకి వివరించారు. క్షేత్రస్థాయి ఇంజినీర్లకు ఆయన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

## స్వీకార్-ఉపకార్ వద్ద బైపాస్ రహదారి

- జేబీఎస్ వద్ద మిగిలిన స్తంభాలను నిర్మించాలంటే ట్రాఫిక్ రాకపోకలు నిలిపేయాలి. అందుకు ప్రత్యామ్నాయంగా స్వీకార్ ఉపకార్ కూడలి వద్ద బైపాస్ రహదారిని హెచ్ఎంఆర్ నిర్మిస్తుంది.
- పరేడ్‌మైదానం ఇంటర్ చేంజ్ మెట్రోస్టేషన్ ఎక్కి, దిగే మార్గాల నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న గణేశ్ ఆలయ సమీప ఆక్రమణలను తొలగించాలని హెచ్ఎంఆర్ఎల్ పట్టణ ప్రణాళిక అధికారులను ఎండీ ఆదేశించారు. పునాదుల నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న మిగతా భవనాల ప్రహరీ తొలగించి నిర్మాణం పూర్తయ్యాక వాటికి తిరిగి నిర్మించి ఇవ్వాలన్నారు.
- పరేడ్‌మైదానం ప్రాంతంలో వయడక్ట్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.
- గాంధీ ఆసుపత్రి వృద్ధాశ్రమం వద్ద స్టేషన్ పునాదుల పనులను ఈనెలాఖరుకు పూర్తిచేయాలని.. అలానే ఇక్కడ విద్యుత్తు తీగలను మరో చోటకు మార్చేందుకు రూ.3.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.
- ముషీరాబాద్ చౌరస్తా దరి ఆలయం ముందు స్తంభాల పనుల వల్ల రహదారి ఇరుకుగా మారి ట్రాఫిక్ నిలిచిపోయే సూచనలున్నాయి. ప్రత్యామ్నాయాలను సిద్ధం చేయాలని ఎల్‌అండ్‌టీ మెట్రో ఇంజినీర్లకు సూచించారు.
- ముషీరాబాద్ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు పునాదుల పనులను వెంటనే ఆరంభించాలన్నారు. ఇక్కడ 80 వరకు స్తంభాలను నిర్మించాల్సి ఉంది.
- వర్షాకాలం ఆరంభం నాటికి పాడైన రహదారులు, గుంతలకు మరమ్మతులు పూర్తి చేయాలని ఎల్‌అండ్‌టీ మెట్రో, హెచ్ఎంఆర్ ఇంజినీర్లను ఆదేశించారు.